సాక్షి సూర్యాపేట

మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



శ్యామ్‌బెనగల్‌కు పోచంపల్లితో..

అనారోగ్యంతో మృతిచెందిన బాలీవుడ్ దర్శకుడు శ్యామ్‌బెనగల్‌కు పోచంపల్లితో అనుబంధం ఉంది. - 8లో



సైన్స్ టీచర్లకు సదవకాశం

సైన్స్ టీచర్లు చేసిన పరిశోధనల పత్రాలు సమర్పించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ అవకాశం కల్పిస్తోంది. - 10లో



సేంద్రియ ఎరువులు వాడాలి

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలని జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ జాయింట్ డైరెక్టర్ సూచించారు. - 10లో

న్యూస్‌రీల్

భిక్షాటనతో సర్వశిక్షా ఉద్యోగుల నిరసన



భిక్షాటన చేస్తున్న సర్వశిక్షా ఉద్యోగులు

భానుపురి (సూర్యాపేట) : విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు మంత్రుల చిత్రపటాల వద్ద భిక్షాటన చేస్తూ వినూత్న రీతిలో తమ నిరసనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలన్నారు. 14 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, ప్రసన్న, గోదాకృష్ణ, కమలాక్షి, మురళి, కవిత, రాజు, కాటి శ్రీనివాస్, లింగస్వామి, సమీనా, తేజ్ కుమార్ రెడ్డి, జానకమ్మ, సుభద్ర, ఉప్పలయ్య, దివ్య, వెంకటేశ్వర్లు, రాజీవ్, సునీత, నాగలక్ష్మి, విజయ, దుర్గ, సుధా, అరుణ, సరిత, వెంకటరమణ, సబిత పాల్గొన్నారు.

ఓబన్న విగ్రహ ప్రతిష్ఠకు స్థలం కేటాయించాలి



కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

సూర్యాపేట: భారత స్వాతంత్ర్యంకోసం పోరాడి 27 ఏళ్లకే వీరమరణం పొందిన వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్ఠకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలని తెలంగాణ వడ్డెర సంఘం సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొడిదల ప్రేమ్‌కుమార్, శివరాత్రి రవి కోరారు. ఈమేరకు సోమవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఓబన్న పోరాటానికి చిహ్నంగా జనవరి 11న తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, నవీన్, గోపి, విజయ్, నాగేశ్వరరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈ సేవ కేంద్రం ప్రారంభం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని న్యాయస్థానాల సముదాయంలో ఈ సేవ కేంద్రాన్ని మంగళవారం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వర్చువల్‌గా ప్రారంభిస్తారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సేవ కేంద్రం వల్ల న్యాయ సహాయం ప్రజలకు త్వరగా చేరుతుందన్నారు. ఆయన వెంట న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, ఎం ఎస్ రాఘవరావు, తదితరులు ఉన్నారు.

కాల్వ కట్టలపై అప్రమత్తత అవసరం




పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ అనిల్‌కుమార్

నడిగూడెం : కాల్వ కట్టలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడం అవసరమని నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జి.అనిల్ కుమార్ సూచించారు. నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు 132 కిలో మీటరు వద్ద సెప్టెంబర్‌లో పడిన గండి ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. కాల్వల వెంట కంపచెట్ల తొలగింపు, మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఈ వి.రమేష్‌బాబు, ఎస్‌ఈ శివ ధర్మతేజ, ఈఈ రామకిషోర్, డీఈ రఘు, ఏఈలు బి.సత్యనారాయణ, బి.సరిత, క్వాలిటీ కంట్రోల్ డివిజన్ డీఈ రామకృష్ణ, ఏఈలు రాందాస్, మహేష్ ఉన్నారు.

• చర్చిలు ముస్తాబు





ఫిబ్రవరి 3న మహా ప్రదర్శన

నూతనకల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో మహా ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బోడ సునిల్ మాదిగ తెలిపారు. మహా ప్రదర్శన విజయవంతం కోసం నూతనకల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. లక్ష డప్పులు వెయ్యి గొంతుల మహా ప్రదర్శనకు ప్రతి గ్రామం నుంచి మాదిగ, మాదగి ఉపకులాలకు చెందిన కవులు, కళాకారులు వేలాదిగా తరలిరావాలని కోరారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయడం లేదన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా గంగాధర్ లక్ష్మీకాంత్, ఉపాధ్యక్షుడిగా గంటా రవిశంకర్, కార్యదర్శిగా కొమ్ము సురేష్, కోశాధికారిగా మాదాసు దయాకర్‌లను ఎన్నుకున్నారు. ఈసమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్వాయి పరశురాములు, మహంకాళి విశ్వనాథ్, యాతాకుల రాజన్న, చింత వినయ్, బొజ్జ సైదులు, పాల్వాయి బాలయ్య, ఇరుగు వెంకన్న, మిర్యాల చిన్ని, మాదాసు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మితిమీరుతున్నారు!

కోదాడలో పెరిగిపోతున్న అల్లరిమూకల ఆగడాలు

ఆదివారం కోదాడ పట్టణంలోని నడిరోడ్డుపై ముగ్గురు యువకులు గొడవ పడుతున్నారు. అటుగా వెళుతున్న కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ గొడవ పడవద్దని వారిని వారించబోయాడు. మత్తులో ఉన్న యువకులు ఆ ఏఎస్‌ఐ పైనే దాడి చేశారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువకులు మత్తులో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

గత వినాయకచవితి రోజు కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద ఉన్న అపార్టుమెంట్ వాసులు రాత్రి సమయంలో టిఫిన్ చెద్దామని దుర్గాపురం వై జంక్షన్ సమీపంలో ఉన్న ఓ హోటల్‌కు వెళ్లారు. అక్కడ వారు టిఫిన్ చేస్తుండగా మందుబాబులు వారిపై దాడి చేసి గాయపర్చారు.



- నిత్యం ఏదో ఒక చోట ఘర్షణ
- రోడ్డున వెళ్లేవారిపై దాడులు
- కంట్రోల్ చేయబోయిన పోలీసులపై కూడా..
- చీకటి పడిందంటే బయటికి వెళ్లాలంటేనే జంకుతున్న జనం

కోదాడ: కోదాడ పట్టణంలో కొంతకాలంగా అల్లరి మూకలు, మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. నిత్యం ఏదో ఓ చోట ఘర్షణలు జరుగుతున్నాయి. రోడ్డున వెళ్లేవారినీ వదలడం లేదు. అకారణంగా గొడవ పడుతూ దాడులకు పాల్పడుతున్నారు. సర్ది చెప్పబోయిన వారిపై, వారించబోయిన పోలీసులతో సైతం గొడవ పడుతున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి వెంట, బైపాస్ రోడ్డు, వై జంక్షన్లలో ఉన్న దాబాల వద్ద ఈ ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. దీంతో చీకటి పడిదంటే బయటికి వెళ్లడానికి పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు.

మరికొన్ని ఘటనలు..

- పది రోజుల క్రితం మత్తులో ఉన్న ఓ యువకుడు బుల్లెట్ సైలెన్సర్ తీసి వేగంగా రోడ్డుపై వెళ్లడంతో ఆ శబ్దానికి భయపడిన ఓ మహిళ స్కూటీపై నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైంది.
- నాలుగు నెలల క్రితం నైట్‌బీట్‌లో ఉన్న కానిస్టేబుల్ కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో ఓ డబ్బా కొట్టువద్ద కూర్చున్నారు. సిగరేట్ల కోసం వచ్చిన ఇద్దరు యువకులు డబ్బాకొట్టు నిర్వాహకుడితో గొడవకు దిగారు. వారించబోయిన కానిస్టేబుల్‌ను తీవ్రంగా కొట్టి అక్కడి నుంచి పరారయ్యారు.
- ఐదు నెలల క్రితం హైదరాబాద్ నుంచి సఫారీ వాహనంలో వచ్చిన కొందరు వ్యాపారులు కోదాడకు చెందిన ఓ వ్యాపారి డబ్బులు ఇవ్వాలని నడి రోడ్డుపై ప్రజలంతా చూస్తుండగా కర్రలు, రాడ్లతో దాడి చేసి వెళ్లిపోయారు. భయ భ్రాంతులకు గురైన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సిబ్బంది చిట్యాల వద్ద ఛేజ్‌చేసి కోదాడకు పట్టుకొచ్చారు. అధికారులు సింపుల్‌గా వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించి వేశారు.

రోడ్లపైనే బర్త్‌డే పార్టీలు

మునుపెన్నడూ లేని విధంగా కోదాడ పట్టణంలో కొత్త సంస్కృతి బయలు దేరింది. కొంత మంది ప్రధాన రహదారి మీదనే బర్త్‌డే పార్టీలు చేస్తూ కత్తులు, కటార్లు పట్టుకొని కేక్‌లు కట్ చేస్తున్నారు. ఈ సమయంలో మద్యం మత్తులో ఉండే అనుచరగణం చేసే గొడవ అంతా ఇంతా కాదు. ఈ విషయంలో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఇలా ఒకరిని చూసి మరొకరు రోడ్లమీద పార్టీలతో సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నారు.

పనిచేయనీయడం లేదా..

ఇదిలా ఉండగా పోలీస్ అధికారుల తీరు మరోలా ఉంది. పట్టణంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిని స్టేషన్‌కు తీసుకురావడానికి ముందే నాయకులు, పైరవీకారులు, మీడియాపేరు చెప్పుకునే వారు తమ వారిని విడిచిపెట్టాలని ఇబ్బంది పెడుతున్నారని తమను పని చేసుకోనీయడం లేదని పోలీసులు అంటున్నారు. పట్టణంలో గుట్కాలు, ఇతర అక్రమ వ్యాపారం చేసేవారిని అదుపులోకి తీసుకున్న నిమిషాల్లోనే తమపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని అంటున్నారు.

ఉపేక్షించేది లేదు



కోదాడ పట్టణంలో శాంతి భద్రతల విషయంలో ఇబ్బంది కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. పోలీస్ అధికా రులకు చట్టప్రకారం పని చేయడానికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం. గంజాయి, గుట్కా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. నిబంధనల ప్రకారం పనిచేయని అధికారులపై కూడా చర్యలు తీసుకుంటాం.

– నలమాద పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యే, కోదాడ

కార్యాలయం దాటి బయటికిరాని అధికారులు

గతంలో కోదాడ పట్టణంలో ఒక టౌన్ స్టేషన్, ఒక ఎస్‌ఐ మాత్రమే ఉండేవారు. ప్రస్తుతం కోదాడ పట్టణంలో ఉన్న స్టేషన్‌లో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, డీఎస్పీ కార్యాలయం, రూరల్ సీఐల కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నాయి. గతంలో ఉన్నతాధికారులు ఉదయం సాయంత్రం పట్టణంలో పర్యటించి ఎక్కడ ఏం జరుగుతుందో అవగాహన చేసుకునేవారు. ప్రస్తుతం ఉన్న అధికారులు స్టేషన్ గదులను దాటి బయటికు రావడం లేదన్న విమర్శలున్నాయి.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హైదరాబాద్ నుంచి వెబెక్స్ ద్వారా సమీక్ష





సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ (ఇన్‌సెట్లో) హైదరాబాద్ నుంచి వెబెక్స్ ద్వారా సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సూర్యాపేట జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై మంత్రి ఉత్తమ్ హైదరాబాద్ నుంచి వెబెక్స్ ద్వారా నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి.. పనుల పురోగతిపై కలెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్, జాన్ పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి కొత్త పైపులైన్స్, పంప్ హౌస్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నవోదయ ఉద్యానంకు గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటుకు మఠంపల్లి మండలంలో సుమారు 100 ఎకరాలు గుర్తించామని, స్థల పరిశీలన చేసేందుకు మంగళవారం టీం ను పంపుతున్నట్లు కలెక్టర్ మంత్రి దృష్టికి తెచ్చారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మ్యాపింగ్, ఆర్కిటెక్ వంటి పనులు ఏడబ్ల్యూఐడీసీ వారి ద్వారా కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం ఆర్ అండ్ బీ ఈఈ సీతారామయ్య మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 10 పనులు, కోదాడలో ఆరు పనులు చేపట్టినట్లు తెలిపారు. పెద్దగట్టు జాతరను పురస్కరించుకొని చేపడుతున్న పనులకు సంబంధించిన వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. జాతరకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమీక్షలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఇరిగేషన్ ఈఈ రామ్ కిషన్, సీపీఓ ఎల్. కిషన్, డీఆర్డీఓ వివి అప్పారావు, డీటీడీఓ శంకర్, డీఈఓ అశోక్ అధికారులు పాల్గొన్నారు.

ఎపిక్ కార్డుల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

- ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయదేవి



సమావేశంలో మాట్లాడుతున్న బాలమాయదేవి

భానుపురి (సూర్యాపేట) : జాతీయ ఓటర్ల దినోత్సవం నాటికి ఎపిక్ కార్డులు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఓటరు జాబితా పరిశీలకురాలు, బీసీ వెల్ఫేర్ కమిషనర్ బి.బాలమాయదేవి సూచించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి అమె స్పెషల్ సమ్మరి రివిజన్ – 2025పై జిల్లాలోని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించిమాట్లాడారు. ఎక్కువగా ఓట్లు నమోదైన, తొలగించిన పోలింగ్ కేంద్రాలను ఈఆర్‌ఓలు పరిశీలించి కారణాలు తెలుసుకోవాలన్నారు. మరణించిన వారి ఓట్లు మరణ ధ్రువీకరణ పత్రం, లేదంటే కుటుంబ సభ్యుల స్టేట్ మెంట్ తీసుకుని తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న ఫొటోలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు నియోజవర్గాల పరిధిలో 1,205 పోలింగ్ కేంద్రాల్లో మహిళా ఓటర్లు 5,15,617, పురుషుల ఓట్లు 4,92,446 ఇలా మొత్తం 10,08,120 ఓట్లు ఉన్నట్లు తెలిపారు. వాటిలో వికలాంగుల ఓట్లు 18,044 ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, ఆర్డీఓలు వేణు మాధవ్, సూర్యనారాయణ, ఎలక్షన్ సూపరింటెండెంట్లు శ్రీనివాసరాజు, వేణు, తహసీల్దార్లు, ఎలక్షన్ డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలను అధికారులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో భాగంగా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 94 దరఖాస్తులు రాగా శాఖల వారీగావాటిని అధికారులకు పంపించామన్నారు. రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు కోసం జనవరిలో డ్రా తీయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే పెద్దగట్టు జాతరకు సంబంధిత శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. కొన్ని శాఖలకు చెందిన అధికారులు తమ నివేదికను రేపటికల్లా అందించాలన్నారు. ప్రజా వాణికి జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీష్ కుమార్, డీఆర్‌డీఓ అప్పారావు, జిల్లా అధికారులు శంకర్, ఎల్.కిషన్, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, శ్రీనివాస్, అశోక్, నరసింహారావు, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి



మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అదించాలని సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి సూచించారు. సోమవారం సూర్యాపేట మండలం పరిధిలోని టేకుమట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. హాజరు పట్టిక, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ముద్దలుగామాడిపోయి ఉండటం చూశారు. నాణ్యమైన భోజనం లేక కొంతమంది ఇంటి వద్ద నుంచి బాక్కులు తీసుకు రావడం గమనించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. మరుగుదొడ్లు లేకపోవడంతో వెంటనే సమస్యలపై దృష్టిసారించాలని హెచ్‌ఎం కు సూచించారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్స్ వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులపై చిగురిస్తున్న ఆశలు

- సంక్రాంతి తర్వాత జారీకి ప్రభుత్వం సన్నాహాలు
- జనవరి నుంచి సన్నబియ్యం ఇచ్చేలా ప్రణాళిక
- దరఖాస్తుదారుల ఎదురుచూపులకు తెరపడే అవకాశం



నాగారం : కొత్తరేషన్‌కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అర్హులకు కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు, కుటుంబ సభ్యుల పేర్లను రేషన్ కార్డుల్లో నమోదు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీలో ప్రకటించారు. సంక్రాంతి తరువాత రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రకటనతో జిల్లాలో అర్హులైన లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

కీలకంగా మారిన రేషన్ కార్డు..

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమపథకాలు పొందాలంటే లబ్ధిదారులకు రేషన్ కార్డు తప్పనిసరి అయ్యింది. ఇటీవల జరిగిన రైతు రుణమాఫీ పథకం మొదలుకుంటే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, మహిళలకు ప్రతినెలా రూ.2,500, యువ వికాసం, గృహలక్ష్మి తదితర పథకాల వరకు అన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికంగా మారింది. గత పదేళ్ల క్రితం నుంచి జన్మించిన పిల్లలకు ఇప్పటికీ రేషన్ కార్డుల్లో పేర్లు లేవు. దీంతో తల్లిదండ్రులు తహసీల్దార్, కలెక్టరేట్‌ల చుట్టూ తిరిగినా లాభం లేకుండా పోయింది. వారి పేరిట దేనికైనా దరఖాస్తు చేద్దామంటే రేషన్‌కార్డులో పేరు లేక సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. ప్రస్తుతం కుటుంబ సభ్యుల పేర్లను కార్డుల్లో చేర్పిస్తామని మంత్రి పేర్కొనడంతో లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా..రేషన్ కార్డుల జారీకి గతంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలుగా, వార్షిక ఆదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్ కార్డులు ఇచ్చారు. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, అర్బన్‌లో రూ.2 లక్షల్లోపు ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకున్నారు. అలాగే భూ విస్తీర్ణం తరి భూమి అయితే 3.5 ఎకరాలు, మెట్ట భూమి అయితే 7.5 ఎకరాల లోపు ఉండాలనే నిబంధ నలు అమలు చేశారు. ఇప్పుడవే నిబంధనలు అమలు చేస్తారా? లేక కొత్తగా మార్గదర్శకాలు నిర్దేశిస్తారా? అన్న అంశాలపై కూడా ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో 95 శాతం వరకు ఈకేవైసీ పూర్తి చేయించారు.

జిల్లాలో 3,24,185 ఆహారభద్రత కార్డులు

జిల్లాలో ప్రస్తుతం 3,24,185 ఆహారభద్రత కార్డులు ఉన్నాయి. వీటిలో 9,31,528 మంది మంది సభ్యులుగా నమోదై ఉన్నారు. ఆరేళ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీ నిలిచిపోగా ఉన్న కార్డుల్లో కొత్తగా మార్పులు, చేర్పులకు అవకాశం లేకుండా పోయింది. అయినా మీసేవ కేంద్రాల్లో సభ్యులను జత చేసేలా ఆన్‌లైన్ వెసులుబాటు కల్పించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా గతంలో 14,977 మంది ఆహార భద్రతకార్డుల్లో పేర్లు జోడించాలని దరఖాస్తులు సమర్పించారు.

ఆదేశాలు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం



కొత్త రేషన్ కార్డుల ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం కొత్తరేషన్ కార్డుల జారీకి కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం ఉంచి ఆదేశాలు రాగానే అర్హులందరికీ కార్డులు జారీ చేస్తాం.

– డి.రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి, సూర్యాపేట

వేలాది మంది ఎదురుచూపులు..

గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను నిలిపివేయడంతో జిల్లాలో వేలాది మంది కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం చౌకధరల దుకాణంలో బియ్యం మాత్రమే అందిస్తుండగా.. వీటికి అదనంగా రాబోయే రోజుల్లో నిత్యావసర సరకులు సైతం పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం అందించనున్నట్లు సర్కారు ప్రకటించింది. ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తు సమయంలోనూ రేషన్ కార్డుల కోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు.

అక్రమాలకు తెర పడేనా..

జిల్లాలో రేషన్ బియ్యం దందా విచ్చలవిడిగా సాగుతోంది. లబ్ధిదారుల వద్ద కిలోల చొప్పున సేకరించి క్వింటాళ్లుగా విక్రయిస్తున్నారు. కొందరు వినియోగదారులు డీలర్లకే విక్రయిస్తున్నారు. రేషన్ బియ్యం దందా నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని శుభవార్త చెప్పింది. ఇలా చేస్తే ఇకపై లబ్ధిదారులు బియ్యాన్ని విక్రయించుకోకుండా సద్వినియోగం చేసుకుంటారు. ఈ విధానం ద్వారా అక్రమాలకు తెరపడే అవకాశం ఉంది.

క్లుప్తంగా

సాక్షి విలేకరి కుటుంబానికి పరామర్శ



సురేష్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాక్షి బృందం

భువనగిరి: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన 'సాక్షి' భువనగిరి రూరల్ విలేకరి ఏనుగు సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులను సోమవారం 'సాక్షి' దినపత్రిక నల్లగొండ యూనిట్ సభ్యులు పరామర్శించారు. సురేష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో బ్రాంచ్ మేనేజర్ రుక్మాధర్, బ్యూరో ఇన్‌చార్జి చింతకింది గణేష్, ఎడిషన్ ఇన్‌చార్జి జనార్దన్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ యంబ నర్సింహులు ఉన్నారు.

28 నుంచి యూటీఎఫ్ విద్యా వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలు

రామగిరి(నల్లగొండ): టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో 28వ తేదీ నుంచి రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నట్లు మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరగనున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కట్టంగూర్: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలం ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన గోపసి భిక్షం(59) ఆదివారం కట్టంగూర్ అయిటిపాముల గ్రామంలో తన బంధువుల శుభకార్యానికి వచ్చాడు. సోమవారం ఉదయం భిక్షం స్వగ్రామానికి వెళ్లేందుకు అయిటిపాముల బస్టాండ్ వద్దకు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ వెనుక నుంచి భిక్షంను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉరేసుకుని బలవన్మరణం

పెన్‌పహాడ్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. లింగాల గ్రామానికి చెందిన రణపంగ జానకిరాములు(43) హైదరాబాద్‌లో ఉంటూ సుతారీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన అతడు ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపారు.

బెల్లం పానకం ధ్వంసం

చింతపల్లి: మండలంలోని వింజమూరుతండాలో నాటుసారా తయారీ స్థావరాలపై సోమవారం నాంపల్లి ఎక్సైజ్ సీఐ సైదులు దాడులు నిర్వహించి 60 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా తయారుచేసినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నాగరాజు, అశోక్‌కుమార్, నాగేశ్వర్‌రావు, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి ఆటో డ్రైవర్ హల్‌చల్

- పోలీసులు న్యాయం చేయడంలేదని ఆరోపణ



చింతాలును పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్‌ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది

కట్టంగూర్: తనను కొట్టిన వారిపై కేసు పెట్టినా పోలీసులు న్యాయం చేయడంలేదని ఓ ఆటో డ్రైవర్ సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన చిలుముల చింతాలు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం చింతాలు ఆటోలో నకిరేకల్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో నకిరేకల్‌కు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై ఆటోకు ఎదురుగా రాంగ్ రూట్లో వస్తుండడంతో చింతాలు అతడిని సక్రమంగా వెళ్లమని మందలించాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి తన స్నేహితులకు ఫోన్ చేసి పిలిపించగా.. వారు చింతాలును తీవ్రంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన చింతాలు అదేరోజు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసి నాలుగు రోజులవుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మనస్తాపానికి గురైన చింతాలు సోమవారం అయిటిపాముల గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఉన్న రిలయన్స్ సెల్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న కట్టంగూర్ ఎస్‌ఐ రవీందర్ తన సిబ్బందితో కలిసి సెల్ టవర్ వద్దకు చేరుకున్నారు. తనకు న్యాయం జరిగేంత వరకు కిందకు దిగనని చింతాలు రెండు గంటల పాటు పోలీసులకు చుక్కలు చూపించాడు. పోలీసులు సెల్ టవర్ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా చింతాలు కిందికి దూకి ఆత్మహత్య చేసుకొనే ప్రయత్నం చేశాడు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో చింతాలు కిందికి దిగి వచ్చాడు. చింతాలును నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై నకిరేకల్ సీఐ రామకృష్ణను వివరణ కోరగా.. చింతాలును కొట్టిన వారిని పిలిపించి మాట్లాడినట్లు తెలిపారు. ఇరు వర్గాలు రాజీపడినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

- నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జిని ఢీకొట్టిన బస్సు
- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద ఘటన



అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం వైపు దూసుకెళ్లిన బస్సు

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ వైపు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి హన్మకొండకు 33 మంది ప్రయాణికులతో బయల్దేరింది. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్దకు రాగానే హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి వైపు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఇనుప చువ్వలను తాకి బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఒకరిమీద ఒకరు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. స్వల్పంగా గాయపడిన ప్రయాణికులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారిపై సరైన ఇండికేషన్ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

గరిడేపల్లి: అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. గరిడేపల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం నర్సాయిగూడెం గ్రామానికి చెందిన నన్నెపంగు వెంకన్న(46) గరిడేపల్లిలోని శివ నాగసాయి ఫిల్లింగ్ స్టేషన్(భారత్ పెట్రోల్ బంక్)లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వెంకన్న అప్పులు చేసి మరీ గ్రామంలో కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురైన వెంకన్న ఆదివారం ఉదయం బంక్‌కు వచ్చి డ్యూటీ మధ్యలోనే గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకన్నను బంక్ సిబ్బంది 108 వాహనంలో హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య కళమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరు నెలల జైలుశిక్ష

మునగాల: చెక్కు బౌన్స్ కేసులో ఓ మహిళకు ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ సోమవారం కోదాడ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె. భవ్య తీర్పు వెలువరించారు. మునగాల మండల కేంద్రానికి చెందిన మోదుగు రామకృష్ణారెడ్డి ఫెర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. 2018లో అతడి వద్ద పెన్‌పహాడ్ మండల కేంద్రంలో ఫెస్టిసైడ్స్ దుకాణం నిర్వహిస్తున్న ముదిరెడ్డి స్వాతి పురుగు మందులు తీసుకొని రూ.3లక్షలకు గాను చెక్కు ఇచ్చింది. ఆ చెక్కును రామకృష్ణారెడ్డి బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యింది. రామకృష్ణారెడ్డి తన లాయర్ ద్వారా ముదిరెడ్డి స్వాతికి నోటీసులు పంపాడు. కోదాడ సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు నమోదు చేశారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా సోమవారం కోదాడ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె. భవ్య ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించి 2025 జనవరి 21లోగా రామకృష్ణారెడ్డికి రూ.3లక్షలు చెల్లించాలని, చెక్కు ఇచ్చి మోసం చేసినందుకు ముదిరెడ్డి స్వాతికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. రాకృష్ణారెడ్డి తరఫున న్యాయవాది ఉయ్యాల నర్సయ్య, ముదిరెడ్డి స్వాతి తరఫున న్యాయవాది భిక్షయ్య(రంగారెడ్డి జిల్లా కోర్టు) వాదనలు వినిపించారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

- మూడు ల్యాప్‌టాప్‌లు అపహరణ

సూర్యాపేటటౌన్: పట్టపగలు ఓ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి మూడు ల్యాప్‌టాప్‌లు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా కోటపహాడ్ గ్రామానికి చెందిన షేక్ నజీర్ బాషాతో పాటు అతడి స్నేహితులు మరో ముగ్గురు కలిసి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జేజేనగర్‌లో అద్దెకు ఉంటున్నారు. వారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో నలుగురు కలిసి క్రికెట్ ఆడేందుకు గ్రౌండ్‌కు వెళ్లారు. పనిమనిషి వచ్చి ఇల్లు శుభ్రం చేస్తుందని ఇంటికి తాళం వేయకుండా వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి మూడు ల్యాప్‌టాప్‌లను ఎత్తుకెళ్లాడు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డవ్వగా.. ఆ వీడియో వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్‌గా మారింది. షేక్ నజీర్‌బాషా ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



పిట్ట నిరంజన్ రెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన కొద్దిరోజులకు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన పిట్ట నిరంజన్‌రెడ్డి(60) ఈ నెల 6వ తేదీ రాత్రి పట్టణ కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్ సమీపంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అతడి మెడ, వెన్నుముకకు డాక్టర్లు శస్త్రచికిత్స చేశారు. వారం రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చారు. కాగా సోమవారం ఉదయం నిరంజన్‌రెడ్డికి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు

ఆత్మకూరు(ఎం): పాతకక్షలతో దాడికి పాల్పడిన కానిస్టేబుళ్లపై చర్య తీసుకోవాలని ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన మారుపాక శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన ఆదె నర్సయ్యతో తనకు కొంతకాలంగా భూతగాదాలు ఉన్నట్లు తెలిపాడు. ఇదే విషయంలో నర్సయ్య తనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ నెల 20న పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని, ఈ క్రమంలో హైదరాబాద్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న నర్సయ్య ఇద్దరు కుమారులు తనపై దాడి చేశారని వాపోయాడు. ఇదే విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారిపై చర్య తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించాడు. కోర్టు నుంచి అనుమతి రాగానే దాడికి పాల్పడిన కానిస్టేబుళ్లపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్.. మహిళ మృతి

అనంతగిరి: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఎదురుగా గడ్డిలోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన అనంతగిరి మండలంలోని ఖానాపురం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని చుట్టుకుంటకు చెందిన కొందరు ఆటోలో కోదాడ నుంచి ఖమ్మం జిల్లా నాయకన్‌గూడేనికి వెళ్తుండగా.. అనంతగిరి మండలం ఖానాపురం గ్రామ సమీపంలో వద్ద గడ్డిలోడుతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న రెడ్డిబోయిన సరోజిని(38) తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ఆటో డ్రైవర్ వీరబాబుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అనంతగిరి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులతో పాటు సరోజిని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

భువనగిరిటౌన్: ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్‌కాలనీకి చెందిన దానవంత్ కిషన్ నాయక్ ఇంటింటి తిరిగి రేషన్ బియ్యం కొనుగోలు చేసి కాకినాడ బస్తీలోని ఓ ఇంట్లో నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు రేషన్ బియ్యం నిల్వ ఉంచిన ఇంటిపై దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కాటన్ మిల్లులో తనిఖీలు



పత్తి వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని శ్రీసిద్ధేశ్వర కాటన్ మిల్లులో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. సీసీఐ, మిల్లు ద్వారా కొనుగోలు చేసిన పత్తి వివరాలు తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వారి వెంట ఏఓ అపర్ణ, ఏఈఓ మనీష ఉన్నారు.

క్యాంపస్ సమాచారం

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



రాత పరీక్షకు హాజరైన అభ్యర్థులు

నల్లగొండ రూరల్: జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఎంజీయూలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ వారు నిర్వహించిన జాబ్ మేళాలో భాగంగా రాత పరీక్షకు 100 మంది హాజరుకాగా 42 మంది ఎంపికయ్యారు. ఇంటర్, డిగ్రీ పాసైన మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి తెలిపారు.

విద్యార్థులకు గణితంపై మక్కువ ఉండాలి



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గణిత విభాగ అధిపతి మద్దిలేటి, అధ్యాపకులు

నల్లగొండ రూరల్: విద్యార్థులకు గణితంపై మక్కువ ఉండాలని ఎంజీయూ గణిత విభాగ అధిపతి మద్దిలేటి పసుపుల అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా సోమవారం ఎంజీయూలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. ఈ ఆధునిక యుగంలో ప్రతీ టెక్నాలజీలో గణితం కీలక పాత్రం పోషిస్తోందని అన్నారు. మద్దిలేటి పసుపుల, గణిత విభాగం అధ్యాపకుడు డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి ఇటీవల నేపాల్ దేశ రాజధాని ఖాట్మండులోని త్రిభువన్ యూనివర్సిటీలో పరిశోధనా పత్రాలను సమర్పించినందుకు గాను ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ వారిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.హైమావతి, ఏ. శ్రీనివాస్, ఎస్. కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంజీయూలో తెలుగు పరీక్ష మూల్యాంకనంపై శిక్షణ

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ తెలుగు శాఖ, భారతీయ భాషా సంస్థ వారి జాతీయ పరీక్ష సేవా కేంద్రం, మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు పరీక్ష పత్రాల మూల్యాంకనం, ప్రశ్నా రచనపై జనవరి 6 నుంచి 11వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంజీయూ జరిగే ఈ శిక్షణకు ఆయా డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకులు, తెలుగు ఉపాధ్యాయులు హాజరుకావాలని, హాజరు కావాలనుకునే వారు ఈ నెల 31వ తేదీ లోగా వారి పేర్లను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

డ్రోన్ ద్వారా మందులు సరఫరా



మందులు తీసుకొచ్చిన డ్రోన్ వద్ద వైద్య సిబ్బంది

బొమ్మలరామారం: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మైలారం గ్రామంలోని పల్లె దవాఖానాకు జాతీయ టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ నుంచి సోమవారం టీబీ రోగులకు డ్రోన్ సహాయంతో మందులు సరఫరా చేశారు. మూడు నెలల క్రితం మైలారం పల్లె దవాఖానా వైద్య సిబ్బంది టీబీ పరీక్ష నిమిత్తం పలువురు వ్యక్తుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను డ్రోన్ సహాయంతో భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కొందరు వ్యక్తులకు టీబీ పాజిటీవ్ రిపోర్ట్ రావడంతో వారికి పల్లెదవాఖానా వైద్య సిబ్బంది బీబీనగర్ ఎయిమ్స్ నుంచి డ్రోన్ సహాయంతో వచ్చిన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు భరత్, ఆశ వర్కర్‌లు చంద్రకళ, మాధవి పాల్గొన్నారు.

శ్యామ్ బెనగల్‌కు పోచంపల్లితో ప్రత్యేక అనుబంధం



సుస్మన్ షూటింగ్ సందర్భంగా ముక్తాపూర్ మాజీ సర్పంచ్ కొంగరి కృష్ణ, మాజీ జెడ్పీటీసీ కొంగరి భాస్కర్‌తో నటుడు ఓంపురి (ఫైల్)



సినిమా చిత్రీకరిస్తున్న బాలీవుడ్ దర్శకుడు శ్యామ్ బెనగల్ (ఫైల్)

- చేనేత కార్మికులపై రూపొందించిన సుస్మన్ చిత్రం ఇక్కడే చిత్రీకరించిన లెజెండరీ దర్శకుడు



శ్యామ్ బెనగల్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : అనారోగ్యంతో సోమవారం మృతిచెందిన ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు పద్మశ్రీ శ్యామ్ బెనగల్(90)కు భూదాన్‌పోచంపల్లితో ప్రత్యేక అనుబంధం ఉంది. 1985లో పారిశ్రామికీకరణతో చేనేత, చేతివృత్తులు ఎలా మసకబారిపోతున్నాయో తెలిపేందుకు ఆయన హిందీలో 'సుస్మన్' అనే చిత్రాన్ని నిర్మించారు. ఆ సినిమాలో ప్రముఖ నటుడు ఓంపురి, నటి షబానా అజ్మీ నటించారు. ఈ సినిమాను పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో చేనేత కార్మికుడు కొంగరి సుందరయ్య ఇంట్లో 40 రోజుల పాటు చిత్రీకరించారు. అదేవిధంగా పోచంపల్లిలో చిలువేరు రామలింగం ఇల్లు, చేనేత సహకార సంఘం ఆవరణలో షూటింగ్ చేశారు. షూటింగ్ అనంతరం యూనిట్ అంతా రాత్రి స్థానిక 101 దర్వాజల భవనంలో బస చేసేవారు. నాడు సరైన వాహన సదుపాయాలు లేకపోవడంతో తిరిగి ఉదయం సైకిళ్లు, స్కూటర్లపై షూటింగ్ కోసమని ముక్తాపూర్ గ్రామానికి వెళ్లేవారు. చాలాకాలం పాటు షూటింగ్ జరగడంతో స్థానికులతో శ్యామ్ బెనగల్‌తో పాటు సినిమాలో నటించిన నటులకు ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. షూటింగ్‌కు అన్నిరకాలుగా సహకరించినందుకు తన అన్న, మాజీ జెడ్పీటీసీ కొంగరి భాస్కర్‌కు దర్శకుడు శ్యామ్‌బెనగల్ నవరత్నాలు పొదిగిన ఉంగరాన్ని బహుమతిగా ఇచ్చారని ముక్తాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కొంగరి కృష్ణ గుర్తుచేసుకున్నారు. ఈ సినిమాలో తన అమ్మ మెడలోని బంగారు గొలుసును షబానా అజ్మీ ధరించారని చెప్పారు. శ్యామ్ బెనగల్ మృతి పట్ల పోచంపల్లికి చెందిన యువ దర్శకుడు భోగ ప్రవీణ్‌కుమార్, బడుగు విజయ్, బింగి సత్యనారాయణ, శ్రీశైలం, రచ్చ రామకృష్ణ, ఎంఏ షరీఫ్, చేరాల ప్రకాశ్, గజ్జల రామకృష్ణ, యంబ హరినాథ్, నూనె వెంకటేష్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

అవార్డుల పంట పండించిన 'సుస్మన్'

పారిశ్రామికీకరణ నేపథ్యంలో గ్రామీణ చేనేత కార్మికుల పోరాటం, బతుకు ఆరాటం ఇతివృత్తంపై నిర్మించిన సుస్మన్ సినిమాకు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. 1987లో విడుదలైన ఈ సినిమా పనోరమా ఫిల్మ్ ఫెస్టివల్, ది చికాగో ఫిల్మ్ ఫెస్టివల్, వాంకోవర్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్, సిడ్నీ, మెల్‌బోర్న్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది.

వేరుశనగలో చీడపీడల నివారణ చర్యలు





నడిగూడెంలో సాగులో ఉన్న వేరుశనగ పంట

నడిగూడెం: వేరుశనగ పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ దశలో వివిధ రకాలు పురుగు, తెగుళ్లు పంటను ఆశించి నష్టపరుస్తుంటాయి. ఇలాంటి సమయంలో పంటను ఆశించే చీడపీడలను నివారిస్తే మంచి దిగుబడులను పొందవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ చెబుతున్నారు. వేరుశనగ సాగులో చీడపీడల నివారణకు పాటించాల్సిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

ఆశించే పురుగులు

1. వేరు పురుగు: వేరు పురుగు తేలికపాటి నేలల్లో ఎక్కువగా ఆశిస్తుంది. వేరు పురుగు ఆశించిన మొక్కలు వాడి ఎండిపోతాయి. మొక్కలను పీకితే సులువుగా ఊడి వస్తాయి. మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోతాయి.

నివారణ చర్యలు : లోతు దుక్కి చేయడం వలన వేరు పురుగు కోశస్త దశలు బయటపడి పక్షులబారిన పడతాయి. ఫోరెట్ 10 శాతం గుళికలను ఆరు కిలోలు గింజ విత్తేటప్పుడు వేయాలి. ఒక కిలో విత్తనానికి 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ మందును పిచికారీ చేయాలి.

2. ఆకు ముడత : ఆకుముడత పురుగు విత్తనం విత్తిన 15 రోజుల నుంచి ఆశిస్తుంది. తల్లి పురుగులు బూడిద రంగులో ఉంటాయి. తొలి దశలో ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఉంటాయి. వాటి లోపల ఆకుపచ్చ రంగులో నల్లని తల కలిగిన పిల్ల పురుగులు ఉంటాయి. ఇవి 2, 3 ఆకులను కలిపి గూడు చేసి వాటిలో ఉండి, పచ్చదనాన్ని తినివేయడం వలన ఆకులన్నీ ఎండి దూరం నుంచి చూస్తే కాలినట్లు కనబడతాయి.

నివారణ చర్యలు : వేరుశనగలో అంతర పంటలుగా జొన్న లేక సజ్జ 7:1 నిష్పత్తిలో వేయాలి. ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను పెట్టి రెక్కల పురుగు ఉనికిని గమనించాలి. క్వినాల్‌ఫాస్ 400 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 500 మి.లీ. మందునుల ఎకరానికి పిచికారీ చేయాలి.

3. పొగాకు లద్దె పురుగు : తల్లి పురుగు లేత గోధుమ రంగులో ఉండి ఆకుపైన మరియు ఆకు అడుగు భాగాన గుంపులుగా గుడ్లు పెడతాయి. దీని పిల్ల పురుగులు గుంపులుగా ఉండి ఆకుపై పత్రహరితాన్ని గోకి తినివేసి, జల్లెడాకుగా మారుస్తాయి. బాగా ఎదిగిన పిల్ల పురుగులు ఆకులను తినివేస్తాయి. పగటి వేళ ఈ పురుగులు చెట్ల అడుగు భాగాన లేక మట్టి పెళ్లలు లేక రాళ్ల కింద దాగి ఉండి రాత్రిపుట మొక్కలను ఆశించి ఆకులను పూర్తిగా తినివేస్తాయి.

నివారణ చర్యలు : దీని నివారణకు వేసవిలో లోతు దుక్కి చేయాలి. నత్రజని మోతాదుకు మించి వాడరాదు. ఎక్కువగా నీటి తడులు పెట్టవద్దు. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలు పెట్టి మగ రెక్కల పురుగులను ఆకర్షించాలి. ఎకరా వేరుశనగ పంటలో 30 నుంచి 40 ఆముదం, పొద్దుతిరుగుడు పంటలను ఎర పంటలుగా వేయాలి. ఎర పంటలపై పెట్టిన గుడ్ల సముదాయాన్ని పిల్ల పురుగులను ఏరి పారేయాలి. పిల్ల పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు వేప నూనె పిచికారీ చేయాలి. పురుగు ఉధృతిని బట్టి క్వినాల్‌ఫాస్ 400 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 400 మి.లీ. ఎకరానికి పిచికారీ చేయాలి.

ఆశించే తెగుళ్లు

1. తిక్కా ఆకుమచ్చ తెగులు : వేరుశనగ పంటకు త్వరగా వచ్చేది ఈ తెగులే. ఆకుమచ్చ తెగులు, పంట వేసిన 30 రోజుల నుంచి కన్పిస్తుంది. ఈ మచ్చలు కొంచెం గుండ్రంగా వుండి, ఆకు అడుగు భాగాన నల్లని రంగు కలిగి ఉంటాయి.

నివారణ చర్యలు : దీని నివారణకు తెగులును తట్టుకొనే రకాలను సాగు చేసుకోవాలి. తెగులు కన్పించిన వెంటనే మ్యాంకోజెబ్ 400 గ్రాములు లేదా కార్బెండిజమ్ 200 గ్రాములు లేదా క్లోరోథానిల్ 400 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. అంతర పంటగా సజ్జను వేయాలి.

2. తుప్పు లేదా కుంకుమ తెగులు: ఆకుల అడుగు భాగంలో ఎరుపు లేక ఇటుక రంగు గల చిన్న పొక్కులు ఏర్పడి ఆకు పైభాగంలో పసుపు రంగు మచ్చలు కన్పిస్తాయి. ఈ తెగులు రబీలో ఉధృతంగా ఆశిస్తుంది.

నివారణ చర్యలు : ఎకరానికి 400 గ్రాముల క్లోరోథానోనిల్ లేక 400 గ్రాముల ట్రిడిమార్ఫ్ లేదా 400 గ్రాముల మ్యాంకోజెబ్ మందును నీటిలో కలిపి మొక్కలు తడిసేలా పిచికారీ చేయాలి.

3. వేరుకుళ్లు తెగులు : ఈ తెగులు సుమారు 30 రోజుల తర్వాత, వర్షాభావ పరిస్థితుల వలన ఎక్కువగా ఆశిస్తుంది. మొదట కాండం మీద గోధుమ వర్ణపు మచ్చలు ఏర్పడతాయి. కొన్ని రోజుల తర్వాత నలుపు వర్ణానికి మారి కాండం పై భాగానికి మరియు వేరుకు కూడా వ్యాపిస్తాయి. ఈ తెగులు వలన తల్లివేరు కుళ్లిపోయి నలుపు రంగులోకి మారి నుజ్జునుజ్జుగా తయారవుతుంది.

నివారణ చర్యలు : ఈ తెగులు నివారణకు తెగులు సోకని పొలం నుంచి విత్తనాలను సేకరించి తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. తెగులు సోకిన మొక్కలను తొలగించి కాల్చివేయాలి. తెగులు సోకిన మొక్కల చుట్టూ గల నేలను 0.1 శాతం కార్బండిజమ్ లేదా 0.3 శాతం మ్యాంకోజెబ్ మందులతో తడిసేటట్లు పిచికారీ చేయాలి.